ఉత్తరం
TG TEL/25/A1234 www.kakatiyanews.com
# కాకతీయ
సోమవారం, 17 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 04 | పేజీలు: 6 వెల: 5

# కల్తీకి చెక్.. మందుల మాయకు కళ్లెం!

- ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విలీనం
- 'టీజీ సేఫ్' పేరుతో కొత్త వ్యవస్థ
- కమిషనర్‌గా అవినాష్ మొహంతి
- ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ విభాగాలతో సమన్వయం
- కల్తీ మసాలాల నుంచి నకిలీ మందుల దాకా నిఘా

**కాకతీయ, హైదరాబాద్ :**

ఆహార కల్తీ, నకిలీ మందుల దందాకు అడ్డుకట్ట వేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఇప్పటివరకు విడివిడిగా పనిచేస్తున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థలను విలీనం చేసి 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్-టీజీ సేఫ్'ను ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆహార కల్తీ, డ్రగ్స్ వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అవినాష్ మొహంతిని టీజీ సేఫ్ కమిషనర్‌గా నియమించింది. ఆహార భద్రత, మందుల నాణ్యత, అక్రమ విక్రయాలపై ఇప్పటివరకు వేర్వేరు విభాగాలు పర్యవేక్షణ సాగించేవి. ఇకపై డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయి. దీంతో ఒకే సంస్థ పరిధిలో తనిఖీలు, నమూనాల సేకరణ, నాణ్యతా పరీక్షలు, ఉల్లంఘనలపై చర్యలు చేపట్టే అవకాశం ఏర్పడనుంది. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ యాక్ట్-2026

........(తరువాయి 2లో)



# ఎమ్మెల్యే సార్..! ఇదేం రాజకీయ నీతి?!

## సీఎం సభకు ఇనుగాలను దూరం పెట్టిన రేవూరి

- పదేళ్లుగా పరకాలలో పార్టీని నిలబెట్టిన నేతపై అణిచివేత..?!
- ఎమ్మెల్యే రాజకీయ కుట్రలంటూ కాంగ్రెస్‌లో విస్తృత చర్చ
- సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత.. ఇనుగాల వర్గంలో మనస్తాపం
- ఎన్నికలకు పదిరోజుల ముందు వచ్చిన రేవూరి.. గెలుపులో ఇనుగాల కీలక పాత్ర
- కలిసి నడుద్దామంటూనే నియోజకవర్గానికి నేతను దూరం చేసే యత్నం
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడి గైర్హాజరుపై పీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే చర్చ
- పరకాల కాంగ్రెస్‌లో హై వోల్టేజీ రాజకీయం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

పరకాలలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభకు హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డిని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆహ్వానించకపోవడం కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. నియోజకవర్గంలో పదేళ్లుగా పార్టీని నిలబెట్టిన ఇనుగాలను ముఖ్యమంత్రి సభకు దూరం పెట్టడం వెనుక ఎమ్మెల్యే రాజకీయ వ్యూహం ఉందా..? ఆయనను రాజకీయంగా అణిచివేసే కుట్రలు మొదలయ్యాయా..? అనే ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. ప్రొటోకాల్‌తో సంబంధం లేని పబ్లిక్ మీటింగ్‌కు కూడా ఇనుగాలను ఆహ్వానించకపోవడాన్ని ఆయన వర్గీయులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. తాజా పరిణామంతో ఇనుగాల అభిమానులు తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఎమ్మెల్యే వ్యవహారశైలిపై సొంత పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న చర్చకు ఈ ఘటన మరింత ఊతమిచ్చింది.

........(తరువాయి 2లో)

- రైతు, ఆడబిడ్డ, నిరుద్యోగుల కోసమే మా ప్రభుత్వం
- 72 వేల ఉద్యోగాలు పూర్తి.. ప్రతి 6 నెలలకు ఖాళీల భర్తీ
- సెప్టెంబరులో అసెంబ్లీ.. కేసీఆర్‌ను తీసుకురండి
- మీ ఆశీర్వాదం ఉంటే వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరు
- ఎవరు సీఎం అయితే ఎవరికి లాభమో లెక్కలతో చెబుతాం
- వరంగల్ గడ్డది పోరాట చరిత్ర.. పాలకులను మట్టికరిపించిన చైతన్యం
- పరకాల ప్రజా పాలన–ప్రగతిబాట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



# కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబానికే లాభం

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలన

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కుటుంబానికే లాభం.. నేను ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నా. కేసీఆర్ కుటుంబం కోసం పదవులు ఇస్తే.. నేను ప్రజల కోసం, ఉద్యమకారుల కోసం పదవులు ఇచ్చా. ఎవరు ముఖ్యమంత్రి అయితే ఎవరికి లాభం జరిగిందో లెక్కలతో చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. సెప్టెంబరులో శాసన సభ సమావేశాలు నిర్వహిస్తా.. కేసీఆర్‌ను కూడా తీసుకురండి.. గత పాలన, మా పాలనపై చర్చిద్దాం. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా నా వెంట్రుక కూడా పీకలేరు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు.

........(తరువాయి 6లో)





# ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

- మేడారాన్ని ప్రపంచస్థాయి క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం
- సాగునీరు, విద్య, వైద్యం, పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యం
- రూ.16,007 కోట్లతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రణాళిక
- యువతకు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ
- ములుగు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రూ.63.50 కోట్లతో నూతన కలెక్టరేట్ ప్రారంభం
- ములుగుకు అభివృద్ధి హామీల వెల్లువ
- మహిళల సంక్షేమానికి పెద్దపీట : మంత్రి సీతక్క

2

# ఖమ్మంలో తుమ్మల అరాచకాలు

- మంత్రి, ఆయన కుమారుడి అండతో మైనింగ్, భూ దందాలు
- గతంలో నాపై ప్రచారం చేసినవారే ఇప్పుడు తుమ్మల వెంట
- ఖమ్మం అభివృద్ధిపై తుమ్మల శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీతారామ ప్రాజెక్టులో నాణ్యత డొల్లతనం బయట పడుతోంది..!
- కేసీఆర్ హయాంలో చేపట్టిన పనులకు కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేస్తోంది
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు



**కాకతీయ, ఖమ్మం టౌన్:**

ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంత్రి తుమ్మల, ఆయన కుమారుడి అండతో ఇసుక, మట్టి, భూ అక్రమాలు సాగుతున్నాయని ఆరోపించారు. గతంలో తనపై 'కాశీం రజ్వీ' అంటూ తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులే ఇప్పుడు తుమ్మల వెంట తిరుగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలి పరిధిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంత్రి, ఆయన కుమారుడి అండతో కొందరు ఇసుక, మట్టి, భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పువ్వాడ ప్రశ్నించారు. గతంలో తనపై తీవ్ర ఆరోపణలు చేసినవారే ఇప్పుడు అధికార పార్టీ నేతల చుట్టూ చేరి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారం అండగా ఉంటే ఏం చేసినా చెల్లుతుందన్న పరిస్థితి ఖమ్మంలో నెలకొన్నదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీని

........(తరువాయి 2లో)

### మళ్లీ యూజీసీనెట్

- ఇంగ్లిష్, కామర్స్, సోషల్ సైన్సెస్‌కు పునః పరీక్ష
- ప్రశ్నపత్రాల్లో కీలక లోపాలు గుర్తింపు
- సెప్టెంబర్ 9, 10 తేదీల్లో పరీక్షల నిర్వహణ
- అభ్యర్థుల నుంచి అదనపు ఫీజు వసూలు లేదు
- మిగతా 84 సబ్జెక్టుల ఫలితాలు యథావిధిగా
- జాతీయ పరీక్షల సంస్థ ప్రకటన

6

# పేదలకు హైటెక్ వైద్యం


- నగర నడిబొడ్డున సూపర్ స్పెషాలిటీ దవాఖాన
- 1,082 పడకలతో టిమ్స్ సనత్‌నగర్
- 300 ఐసీయూ బెడ్లతో అత్యాధునిక వైద్యం
- 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు
- 6 విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభం

4




### గవర్నర్ విచారణకు ఆదేశిస్తారా?

- రూ.40 లక్షల బకాయిలకు రూ.4 లక్షలు అడిగారంటూ ఫిర్యాదు
- 10 శాతం కమిషన్ డిమాండ్ చేశారని ఆరోపణ
- వైద్య, ఆరోగ్య శాఖలో రూ.120 కోట్ల బిల్లులు పెండింగ్ అంటూ ప్రస్తావన
- బిల్లుల చెల్లింపులపై గతంలోనూ ఆరోపణలు
- పర్సంటేజీ ప్రభుత్వమంటూ విపక్షాల విమర్శలు
- గవర్నర్ శివప్రతాప్ శుక్లకు అడ్వకేట్ కరుపోతుల రేవంత్ ఫిర్యాదు



Date: 10.08.2026

To,
**Shri Shiv Pratap Shukla Sir.**
The Governor of Telangana,
Lok Bhavan, Somajiguda, Hyderabad, Telangana, 500041.

**Respected Sir,**

**Sub: Complaint seeking a time-bound, impartial inquiry into public allegations of demand of illegal commission/gratification by Smt. Nandini Bhatti, wife of the Hon'ble Deputy Chief Minister & Finance Minister, Sri Mallu Bhatti Vikramarka, for release of retirement benefits of a retired Government employee – request for registration of case and investigation – reg.**

I, Karupothula Revanth, practising Advocate and Social Activist based at Amberpet, Hyderabad, am filing this complaint in public interest, on the basis of statements that have been made openly to the media and which are now widely circulating on social and print media platforms in Telangana.

**1. Facts as reported in the media**

1. On 09.08.2026, at a protest organized by retired Government employees near Indira Park, Hyderabad, Smt. S.K. Prasannakumari, General Secretary of the INTUC-affiliated employees' federation and herself a retired employee of the Medical & Health Department, publicly stated to media persons that when she approached the wife of Deputy Chief Minister Sri Mallu Bhatti Vikramarka regarding her own pending retirement benefits, she was asked to pay a 10% commission for their release.
2. Specifically, it has been reported that a demand of Rs. 4,00,000 (Rupees Four Lakh only) was made for releasing Rs. 40,00,000 (Rupees Forty Lakh only) of her pending retirement dues.
3. Smt. Prasannakumari further alleged that in the Medical & Health Department alone, bills worth approximately Rs. 120 crores are pending, and that commissions ranging from 6% to 10% are being demanded before files are moved or bills are cleared.
4. These statements were made openly before the media and a video of the same has gone viral on social media platforms, and have been reported by Telugu news outlets, including Namasthe Telangana (NT News), on 10.08.2026.

# ఓబీసీలను జనగణనలో విస్మరిస్తారా

- బీసీలను పక్కనపెట్టడం సామాజిక న్యాయానికి విఘాతం
- 40 ప్రశ్నల్లోనూ ఓబీసీలకు చోటేది
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం
- తెలంగాణ బీజేపీ నేతలు కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు
- వివక్షపై జాతీయ ఉద్యమానికి సిద్ధం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

4



# లడ్డూల నుంచి.. కోట్ల మోసం వరకు!

- కొండపల్లి గణేష్ ఎపిసోడ్‌లో విస్తుపోయే కోణాలు
- రూ.29 లక్షలు.. రూ.51 లక్షల లడ్డూ పాటలతో హల్‌చల్
- అధిక వడ్డీ ఆశ చూపి రూ.3.50 కోట్ల వసూళ్లు
- ఖమ్మం.. హైదరాబాద్‌లోనూ భారీగా పెట్టుబడుల సేకరణ
- 95 మందిని ప్రతివాదులుగా చేర్చి రూ.33 కోట్ల ఐపీ దాఖలు

4



# భట్టి సతీమణిపై ఆరోపణలు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని భట్టిపై బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. తాజాగా అడ్వకేట్ కరుపోతుల రేవంత్ గవర్నర్ శివప్రతాప్ శుక్లకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ఆరోపణలపై గవర్నర్ విచారణకు ఆదేశిస్తారా..? సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరుతారా..?

........(తరువాయి 2లో)

# భట్టి సతీమణిపై ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

అనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఈనెల 10న గవర్నర్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, గతంలో బిల్లుల చెల్లింపులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వంలోని పెద్దల మధ్య కూడా ఈ విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో విపక్షాలు ప్రభుత్వాన్ని పర్సంటేజీ ప్రభుత్వంగా విమర్శిస్తున్న నేపథ్యంలో అడ్వకేట్ రేవంత్ గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గవర్నర్‌కు సమర్పించిన ఫిర్యాదు ప్రతి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు సమీపంలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్.కె. ప్రసన్నకుమారి చేసిన ఆరోపణలను ఆధారంగా చేసుకుని కరుపోతుల రేవంత్ ఈనెల 10న గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తాను వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందానని ప్రసన్నకుమారి మీడియా ముందు వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాల విడుదల కోసం నందిని భట్టిని సంప్రదించినప్పుడు 10 శాతం కమిషన్ అడిగినట్లు ఆమె ఆరోపించారని తెలిపారు. తనకు రావాల్సిన రూ.40 లక్షల పదవీ విరమణ బకాయిలను విడుదల చేసేందుకు రూ.4 లక్షలు అడిగినట్లు ప్రసన్నకుమారి ఆరోపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**పదవీ విరమణ బకాయిలపై ఆరోపణలు**

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తనకు రావాల్సిన రూ.40 లక్షల పదవీ





విరమణ బకాయిలను విడుదల చేయడానికి 10 శాతం చొప్పున రూ.4 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎస్.కె. ప్రసన్నకుమారి ఆరోపించారు. ఈ ఆరోపణలను ఆమె నిరసన కార్యక్రమంలో మీడియా ముందు వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చిందని, ఈ అంశంపై తెలుగు వార్తా సంస్థల్లోనూ కథనాలు ప్రచురితమైనట్లు కరుపోతుల రేవంత్ గవర్నర్‌కు సమర్పించిన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఆరోపణలు నిజమో కాదో తేల్చేందుకు స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరపాలని ఫిర్యాదుదారు కోరారు. ఎవరినీ ముందుగానే దోషిగా నిర్ధారించడం లేదని, అయితే పదవీ విరమణ ఉద్యోగి చేసిన నిర్దిష్ట ఆరోపణలు ప్రజా ప్రయోజనానికి సంబంధించినవిగా ఉన్నందున అధికారికంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోపణలకు సంబంధించిన రికార్డులు, ఫైళ్ల కదలిక, ఆమోద ప్రక్రియ, బిల్లుల చెల్లింపుల వివరాలను పరిశీలించాలని కోరారు.

**గతంలోనూ ఆరోపణల చర్చ**

బిల్లుల చెల్లింపులకు సంబంధించి నందిని భట్టిపై గతంలోనూ అనేక మార్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారం ఇప్పటికే రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా పదవీ విరమణ ఉద్యోగి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ అడ్వకేట్ రేవంత్ గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. ప్రభుత్వంలోని పెద్దల మధ్య కూడా ఈ విషయంపై సీరియస్‌గా చర్చ జరుగుతోందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంపై విపక్షాలు బిల్లుల చెల్లింపులు, కాంట్రాక్టర్ల వ్యవహారాలను ప్రస్తావిస్తూ పర్సంటేజీ ప్రభుత్వం అంటూ విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భట్టి సతీమణిపై తాజాగా వచ్చిన ఆరోపణలు, వాటిని ప్రస్తావిస్తూ గవర్నర్‌కు అందిన ఫిర్యాదు రాజకీయంగా మరింత చర్చకు కారణమైంది. అయితే గతంలో వచ్చిన ఆరోపణలు, తాజాగా ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై అధికారికంగా విచారణ జరిగితేనే వాస్తవాలు తేలాల్సి ఉంది.

**రూ.120 కోట్ల బిల్లుల ప్రస్తావన**

వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు రూ.120 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేసేందుకు 6 శాతం నుంచి 10 శాతం వరకు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఎస్.కె. ప్రసన్నకుమారి ఆరోపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫైళ్లు ముందుకు కదలడానికి, బిల్లులు క్లియర్ కావడానికి అక్రమ కమిషన్లు అడుగుతున్నారా అనే అంశాన్ని విచారణలో తేల్చాలని కోరారు. పదవీ విరమణ ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, సెలవుల నగదీకరణ, ఇతర తుది బకాయిల విడుదలకు సంబంధించిన ఫైళ్ల కదలిక, ఆమోదం, చెల్లింపుల రికార్డులను పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు. వైద్య, ఆరోగ్య శాఖలోనే కాకుండా ఇతర శాఖల్లోనూ ఇలాంటి ఫిర్యాదులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి డిమాండ్లు ఎదుర్కొన్న ఇతర పదవీ విరమణ ఉద్యోగుల వాంగ్మూలాలను కూడా నమోదు చేయాలని కోరారు. గవర్నర్‌కు సమర్పించిన ఫిర్యాదులో ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక, కాలపరిమితితో కూడిన విచారణ జరిపించాలని కరుపోతుల రేవంత్ కోరారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా తేల్చాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన ఎస్.కె. ప్రసన్నకుమారితోపాటు ఇలాంటి సమస్యలను ఎదుర్కొన్న ఇతర పదవీ విరమణ ఉద్యోగులకు వేధింపులు, ప్రతీకార చర్యలు లేదా బకాయిల ఆలస్యం జరగకుండా చూడాలని కోరారు. ఫిర్యాదు ప్రతులను అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్, తెలంగాణ లోకాయుక్త రిజిస్ట్రార్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ డీజీపీ, ముఖ్యమంత్రి కార్యాలయంలోని ప్రజావాణి, ఫిర్యాదుల విభాగానికి పంపినట్లు పత్రంలో పేర్కొన్నారు. ఆరోపణల తీవ్రత, ప్రజా ప్రయోజనం, పెద్ద సంఖ్యలో పదవీ విరమణ ఉద్యోగులు ప్రభావితమవుతున్నారన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు గవర్నర్‌కు చేసిన ఫిర్యాదు ప్రతి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ అంశంపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతుండగా, మరికొందరు ఆరోపణలు నిర్ధారణ కాకముందే వాటిని ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. దీంతో ఫిర్యాదులోని అంశాలపై సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ కొనసాగుతోంది. ఇప్పటివరకు గవర్నర్ కార్యాలయం నుంచి ఈ ఫిర్యాదుపై అధికారిక స్పందన వెలువడలేదు. గవర్నర్ ఫిర్యాదును పరిశీలించి విచారణకు ఆదేశిస్తారా, సంబంధిత శాఖ నుంచి నివేదిక కోరుతారా, అవినీతి నిరోధక శాఖకు పంపుతారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. గతంలోనూ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఆరోపణలు రావడం, తాజాగా పదవీ విరమణ ఉద్యోగి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ గవర్నర్‌కు ఫిర్యాదు అందడం, విపక్షాలు పర్సంటేజీ ప్రభుత్వం అంటూ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. గవర్నర్ తదుపరి చర్య ఏమిటన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఖమ్మంలో తుమ్మల అరాచకాలు

(మొదటిపేజీ తరువాయి)

వీడలేదని, పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని చెప్పారు. ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని, తమపై జరుగుతున్న ప్రతి దానికి తగిన సమాధానం చెబుతామని అన్నారు.

**ఖమ్మానికి తుమ్మల చేసిందేమిటి?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని పువ్వాడ పేర్కొన్నారు. ఖమ్మం అభివృద్ధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే ప్రత్యేకమైన పని ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవులు అనుభవించారని, కానీ ఖమ్మం అభివృద్ధికి ఆయన చేసిన పనులపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. తాను ఇకముందూ ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని పువ్వాడ స్పష్టం చేశారు. తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. సోషల్ మీడియాలో తన పేరు కనిపిస్తే కొందరు ఉలిక్కిపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయని పువ్వాడ ఆరోపించారు. నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ దెబ్బతినడం ప్రాజెక్టు నాణ్యతపై అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రజాధనంతో చేపట్టిన భారీ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే భవిష్యత్తులో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు.

**కేంద్రం రోడ్డుకు.. క్రెడిట్ ఎవరిది?**

దేవరపల్లి-ఖమ్మం జాతీయ రహదారి విషయంలోనూ మంత్రి తుమ్మలపై పువ్వాడ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన రహదారికి రాష్ట్ర మంత్రి క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రజల భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పువ్వాడ తెలిపారు. వాటికి నిధులు విడుదల చేసి, జీవోలు జారీ చేసింది నాటి ప్రభుత్వమేనన్నారు. మున్నేరు వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే రక్షణ చర్యలు చేపట్టామని చెప్పారు. ఖమ్మం బస్‌స్టాండ్ నిర్మాణం, గోళ్లపాడు చానల్ అభివృద్ధి వంటి పనులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వం వేసిన పునాదులపై పనులు కొనసాగిస్తూ.. వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ కొట్టేస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలన అట్టర్‌ఫ్లాప్ సినిమా మాదిరిగా మారిందని పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

# ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, ఉపాధి, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మేడారం ఆధ్యాత్మిక, గిరిజన సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అభివృద్ధి చేస్తామని, మల్లూరు నరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. జంపన్నవాగును సమగ్రంగా అభివృద్ధి చేసి అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, స్నాన ఘట్టాలు నిర్మిస్తామని వెల్లడించారు. ములుగు యువతకు జర్మన్, జపనీస్, కొరియన్ భాషల్లో ఉచిత శిక్షణ అందించి అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తామని చెప్పారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు జిల్లాకు కీలక హామీలు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.16,007 కోట్లతో 2,145 గ్రామీణ రహదారులను 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసే ప్రణాళికను ములుగు నుంచి ప్రారంభించారు. రూ.63.50 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**వనదేవతలకు ప్రత్యేక పూజలు**

కామారెడ్డి జిల్లా నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు చేరుకున్న ఆయనకు గిరిజన పూజారులు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు. వనదేవతలను దర్శించుకున్న సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తన మొక్కులో భాగంగా తులాభారంలో 66 కిలోల నిలువెత్తు బంగారం బెల్లాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం పూజారులు సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మేడారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శుద్ధ తాగునీటి కేంద్రాన్ని సీఎం ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**మేడారానికి ప్రపంచస్థాయి గుర్తింపు**

మేడారం సమ్మక్క-సారలమ్మ దేవాలయ ప్రాంతాన్ని రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో విశిష్టంగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. మేడారం ఆధ్యాత్మికతతోపాటు గిరిజన సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని, ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు మల్లూరు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మేడారం భక్తుల సౌకర్యాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్నవాగును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట్ల చెక్‌డ్యామ్‌లు, స్నాన ఘట్టాలు నిర్మిస్తామని తెలిపారు. గోదావరి తీర ప్రాంతమైన ములుగులో సాగునీటి కొరత లేకుండా చేయడానికి అవసరమైన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.

**రహదారులతో గ్రామాలకు మెరుగైన అనుసంధానం**

ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ఆలయం సమీపంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.16,007 కోట్లతో 2,145 గ్రామీణ రహదారులను 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం కల్పించడమే ఈ ప్రణాళిక లక్ష్యంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రయోజనం కలగనుంది.

**రూ.63.50 కోట్లతో నూతన కలెక్టరేట్**

రూ.63.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ములుగు జిల్లా నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే చోట అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందనున్నాయి. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. జిల్లాలో చేపట్టిన సుమారు రూ.868 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పరిశీలించారు. త్వరలో జిల్లా ఎస్పీ కార్యాలయం, కోర్టు భవనాల నిర్మాణాలను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు.

**యువతకు అంతర్జాతీయ అవకాశాలు**

ములుగు జిల్లా యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడతామని సీఎం తెలిపారు. జర్మనీ, జపాన్, కొరియా దేశాల్లోని ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు జర్మన్, జపనీస్, కొరియన్ భాషల్లో ఉచిత శిక్షణతోపాటు సాంకేతిక నైపుణ్యాలు అందిస్తామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ బోధన అందించడంతోపాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా యువతలో ఆధునిక నైపుణ్యాలను పెంపొందిస్తామని తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం అందుబాటులోకి రావడం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

**చేయూత పింఛన్ల పంపిణీ**

మేడారం ఆలయ ప్రాంగణంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు పత్రాలు, చెక్కులను సీఎం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో సీఎం ముచ్చటించి వారి ఉపాధి కార్యక్రమాలు, ఆర్థికాభివృద్ధి గురించి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. పూజారులు, డోలు వాయిద్య కళాకారులతోనూ మాట్లాడారు.

**మహిళలకు 'సారె' చీరలు**

మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సమ్మక్క-సారలమ్మ బిడ్డలకు 'సారె' పేరుతో నాణ్యమైన చీరలను అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మహిళలకు చిలకపచ్చ రంగు చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి సీతక్క పర్యవేక్షణలో చీరల ఎంపిక, రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం**

మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సాగునీటి రంగంలో రూ.200 కోట్లతో పొట్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప-లక్నవరం అనుసంధాన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సమ్మక్క-సారలమ్మ సన్నిధి అభివృద్ధితోపాటు విద్య, వైద్యం, పర్యాటకం, గృహ నిర్మాణం, సాగునీరు, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో శంకుస్థాపనలకే పరిమితమైన పనులకు ప్రజా ప్రభుత్వం నిధులు విడుదల చేసి ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ములుగు ప్రాంతాన్ని హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా మేడారం, ములుగు ప్రాంతాల్లో భారీగా ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీలు బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, నాయని రాజేందర్‌రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, మందుల సామేలు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సీఈఓ దివ్య, మేడారం ఈఓ వీరస్వామి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కల్తీకి చెక్.. మందుల మాయకు కళ్లెం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం టీజీ సేఫ్ కమిషనర్‌కు అధికారాలు, విధులు అప్పగించారు. ఆహార భద్రతా ఉల్లంఘనలపై విభాగాల మధ్య సమన్వయం పెంచడంతోపాటు చర్యలను మరింత వేగవంతం చేయడమే ఈ వ్యవస్థ ఏర్పాటు వెనుక ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**కల్తీకి అడ్డుకట్ట పడేనా?**

రాష్ట్రంలో తనిఖీలు, కేసులు నమోదవుతున్నా ఆహార కల్తీ వ్యవహారాలు మాత్రం పూర్తిగా ఆగడం లేదు. ఇళ్లలో ఉపయోగించే పదార్థాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్లలో అందించే ఆహారం వరకు నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొన్ని హోటళ్లలో రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటనలు వెలుగుచూశాయి. ఇక హైదరాబాద్ కాటేదాన్ కేంద్రంగా సాగుతున్న కల్తీ మసాలాల వ్యవహారాన్ని హెచ్-ఫాస్ట్ బృందం గుర్తించి ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేయడంతోపాటు 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులను స్వాధీనం చేసుకుంది. నగరంలో అనధికారికంగా ఆహార పదార్థాలు తయారు చేసే కేంద్రాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై నిఘా పెంచేందుకు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్)ను ఏర్పాటు చేశారు.

**మందులపైనా నిఘా**

ఆహార పదార్థాలకే పరిమితం కాకుండా నకిలీ, నాణ్యత లేని మందుల తయారీ, అక్రమ రవాణా, విక్రయాలపైనా టీజీ సేఫ్ దృష్టి పెట్టనుంది. ప్రజల ఆరోగ్యంతో నేరుగా ముడిపడిన మందుల విషయంలో నాణ్యతా ప్రమాణాలను ఉల్లంఘించే సంస్థలు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు కొత్త వ్యవస్థ ఉపయోగపడనుంది. ఒకే వ్యవస్థలో ఫుడ్, డ్రగ్స్ విభాగాలను తీసుకురావడం వల్ల సమాచార మార్పిడి, తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో వేగం పెరిగే అవకాశం ఉంది. అయితే వ్యవస్థ ఏర్పాటు మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు, నాణ్యతా పరీక్షలు, కేసుల దర్యాప్తు, శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నప్పుడే ఫలితం కనిపించనుంది. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 ద్వారా అధికారులకు తనిఖీలు, నమూనాల సేకరణ వంటి అధికారాలు ఉన్నాయి. అయితే సాధారణ నాణ్యతా లోపాలకు పాల్పడే విక్రేతలకు, ప్రజల ప్రాణాలను ఉద్దేశపూర్వకంగా పణంగా పెట్టే సంఘటిత కల్తీ ముఠాలకు ఒకే రీతిలో చట్టపరమైన చర్యలు ఉండకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బు కోసం విషపూరిత పదార్థాలను ఆహారంలో కలిపే కల్తీదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. టీజీ సేఫ్ ఏర్పాటు ఆ దిశగా తొలి అడుగుగా మారినా.. కల్తీ దందా మూలాలను గుర్తించి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే 'కల్తీ రహిత తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుంది.

# ఎమ్మెల్యే సార్..! ఇదేం రాజకీయ నీతి..?!

(మొదటిపేజీ తరువాయి)

**సీఎం సభకు ఇనుగాలకు ఆహ్వానించని రేవూరి..!**

సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న పరకాల సభకు ఇనుగాల వెంకట్రామిరెడ్డిని ఆహ్వానించకపోవడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొటోకాల్‌తో సంబంధం లేని పబ్లిక్ మీటింగ్ అయినప్పటికీ పార్టీకి చెందిన కీలక నేతగా, హన్మకొండ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఇనుగాలను పిలవకపోవడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న ఇనుగాలకు పరకాలపై మంచి పట్టు ఉందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి కాంగ్రెస్ కండువా సైతం కప్పుకోకుండానే పార్టీ టికెట్ ఖరారు చేసుకోవడం వెనుక తెరవెనుక అనేక అంశాలు ప్రభావం చూపినట్లు వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు రేవూరి అనుచరులు సైతం పరకాల ఎమ్మెల్యేగా ఆయన గెలుపునకు ఇనుగాల పూర్తి స్థాయి సహకారం అందించారన్న విషయాన్ని గుర్తుచేస్తుండటం గమనార్హం. అలాంటి నేతను కనీసం సీఎం సభకు కూడా ఆహ్వానించకపోవడంపై మాత్రం పార్టీ నేతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇనుగాలను అణిచివేసే కుట్రలపై చర్చ**

ఎన్నికల గెలుపు తర్వాత క్రమంగా నియోజకవర్గంలో ఇనుగాల ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలను రేవూరి ప్రారంభించారన్న చర్చ కాంగ్రెస్‌లో ఉంది. ఇప్పుడు సీఎం సభకు ఆహ్వానించకపోవడం కూడా అదే రాజకీయ వ్యూహంలో భాగమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఇనుగాలకు ఉన్న పట్టు, కార్యకర్తలతో ఉన్న అనుబంధాన్ని తగ్గించి ఆయనను రాజకీయంగా బలహీనపరిచేందుకు ఎమ్మెల్యే ఒక్కో అడుగు వేస్తున్నారా అనే అంశంపై పార్టీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కలిసి నడుద్దామంటూనే నియోజకవర్గ రాజకీయాలకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇనుగాల వర్గీయుల నుంచి వస్తున్నాయి. పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నేత ప్రాధాన్యాన్ని తగ్గించడం వల్ల క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కొందరు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

**డీసీసీ అధ్యక్షుడు ఎక్కడ..?**

సీఎం రేవంత్‌రెడ్డి సభ వేదికపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉన్న సమయంలో హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి లేకపోవడంపైనా పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న ఇనుగాలను కీలక కార్యక్రమానికి ఆహ్వానించకపోవడంపై నాయకులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు వేదికపై ఉండగా డీసీసీ అధ్యక్షుడు లేకపోవడం ఎలా జరిగిందన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో పీసీసీ అధ్యక్షుడు సైతం ఎలా మిన్నకుండిపోతారంటూ కొంతమంది ఇనుగాల వర్గీయులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పార్టీకి సంబంధించిన ముఖ్య కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడి భాగస్వామ్యం లేకపోవడం పార్టీ అంతర్గత సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని పలువురు నాయకులు అంటున్నారు.

**సొంత పార్టీలోనే రేవూరిపై వ్యతిరేకత**

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వ్యవహారశైలిపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న చర్చ కొనసాగుతోంది. ఇనుగాలను రాజకీయంగా అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న భావన బలపడితే అది కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తుందని కొందరు నేతలు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం పదేళ్లుగా పనిచేసిన నాయకుడికి కనీస గౌరవం ఇవ్వకపోవడం కార్యకర్తలకు తప్పుడు సంకేతాలు పంపుతుందని అంటున్నారు. ఇనుగాల వర్గంలో నెలకొన్న మనస్తాపాన్ని తొలగించి నేతలందరినీ కలుపుకుని వెళ్లాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ఇలాంటి పరిణామాలు కొనసాగితే నాయకుల మధ్య దూరం పెరిగి పార్టీ కేడర్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**పరకాల కాంగ్రెస్‌లో హై వోల్టేజీ**

హన్మకొండ డీసీసీ అధ్యక్షుడైన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని సీఎం సభకు దూరం పెట్టడం, ఆయనకు నియోజకవర్గంలో ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాలపై చర్చ జరగడం, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలోనే డీసీసీ అధ్యక్షుడి గైర్హాజరు అంశం తెరపైకి రావడం, ఎమ్మెల్యే రేవూరి తీరుపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవడం పరకాల కాంగ్రెస్‌లో హై వోల్టేజీ చర్చకు దారితీసింది. ఇనుగాలను రాజకీయంగా అణిచివేస్తున్నారన్న ప్రచారానికి పార్టీ నాయకత్వం ఎలా తెరదించుతుంది, రేవూరి-ఇనుగాల మధ్య రాజకీయ సమీకరణాలు ఎటు మళ్లుతాయి, భవిష్యత్తులో ఇద్దరు నేతలు కలిసి పనిచేస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**పదేళ్ల పార్టీ సేవ.. రేవూరి గెలుపులో కీలక పాత్ర**

పరకాలలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న సమయంలోనూ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పదేళ్లపాటు పార్టీని కాపాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచారని ఆయన వర్గీయులు గుర్తుచేస్తున్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన నేతగా నియోజకవర్గంలో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెబుతున్నారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎన్నికలకు కేవలం పదిరోజుల ముందు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని, ఆ సమయంలో పార్టీ అభ్యర్థిత్వం, ఎన్నికల సమీకరణలు, కార్యకర్తల సమన్వయంలో ఇనుగాల కీలకంగా వ్యవహరించారని అంటున్నారు. గత ఎన్నికల్లో ఇనుగాల సాయంతోనే రేవూరి గట్టెక్కారని, ఎన్నికల సమయంలో సహకరించిన నేతను ఇప్పుడు రాజకీయంగా దూరం చేయడం కృతజ్ఞతా రాహిత్యమేనని విమర్శిస్తున్నారు. కలిసి నడుద్దామని చెబుతూనే ఇనుగాల రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నిస్తున్నారు.

# రేవంత్..! వనదేవతలకు ముందు క్షమాపణ చెప్పు..

- సమ్మక్క-సారక్క తల్లులపై ప్రమాణాలు చేసి మోసం చేశారు
- హామీలపై మాట తప్పినందుకు ప్రజలను నయవంచన
- ప్రకృతి విపత్తులకు సీఎం వైఖరే కారణం
- కేసీఆర్ వేసిన పునాదులపై కాంగ్రెస్ రంగులు
- ములుగు ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారు

**బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు**




కాకతీయ, ఏటూరునాగారం : ములుగు జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రకృతి విపత్తులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై పదేపదే ప్రమాణాలు చేసి, అనంతరం మాట తప్పడమే కారణమని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు తీవ్ర ఆరోపణలు చేశారు. ములుగు జిల్లాలో అడుగుపెట్టే ముందు సీఎం రేవంత్‌రెడ్డి సమ్మక్క–సారక్క వనదేవతల వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని, ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో మాట తప్పినందుకు ప్రజల ముందు క్షమాపణ చెప్పిన తర్వాతే కలెక్టరేట్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాకతీయ, ఏటూరునాగారం : ములుగు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో లక్ష్మణ్‌బాబు ఈ వ్యాఖ్యలు చేశారు. దేవతలపై ఓట్లు వేసి మాట తప్పడం సీఎంకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని లక్ష్మణ్‌బాబు విమర్శించారు. సమ్మక్క–సారక్క తల్లులపై పదేపదే ప్రమాణాలు చేసి మాట తప్పడం వల్లే ములుగు ప్రాంతంలో టోర్నాడోలు, సుడిగాలులు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని వ్యాఖ్యానించారు. గోదావరి కూడా ప్రజలను భయపెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

### వనదేవతలను అవమానిస్తే క్షమించరు

వనదేవతలను అవమానించి, ప్రజల విశ్వాసాలతో చెలగాటమాడితే సమ్మక్క–సారక్క తల్లులు కూడా సీఎం రేవంత్‌రెడ్డిని క్షమించరని లక్ష్మణ్‌బాబు హెచ్చరించారు. ములుగు ప్రజల ఆరాధ్య దైవాలపై చేసిన ప్రమాణాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ములుగు కలెక్టరేట్ నిర్మాణానికి మాజీ సీఎం కేసీఆర్ ఫౌండేషన్ వేసి, రూపురేఖలు తీసుకొచ్చి నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లారని లక్ష్మణ్‌బాబు తెలిపారు. తాము కట్టిన కలెక్టరేట్‌కు రంగులు వేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్లుగా ప్రచారం చేసుకోవడం రాజకీయ ప్రచారంలో భాగమేనని విమర్శించారు. ఎవరు పునాదులు వేశారు, ఎవరు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లారు, ఇప్పుడు ఎవరు ప్రారంభిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులకు రంగులు వేసుకుని తమ ఘనతగా చెప్పుకోవడం, మరోవైపు దేవతలపై ప్రమాణాలు చేసి మాట తప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని లక్ష్మణ్‌బాబు మండిపడ్డారు. ప్రజల విశ్వాసాలను గౌరవించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

## ఫోటోగ్రాఫర్ కుడుతాల రమేష్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

**ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీల్లో కన్సోలేషన్ బహుమతి**

**తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం పోటీల్లో గుర్తింపు**

**రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 306 ఛాయాచిత్రాలు**

**హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ప్రదానం**



కాకతీయ, వరంగల్ బ్యూరో : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీల్లో వరంగల్‌కు చెందిన మన తెలంగాణ ఫోటోగ్రాఫర్ కుడు తాల రమేష్ కన్సోలేషన్ బహుమతికి ఎంపికయ్యారు. ఫోటోజర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలకు, ప్రతిభకు ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం ప్రతి ఏడాది ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 102 ఎంట్రీలు అందగా, 306 ఛాయాచిత్రాలు పోటీలో నిలిచాయి.

### నిపుణుల కమిటీ పరిశీలన

వివిధ ప్రాంతాలు, సంఘటనలు, సామాజిక అంశాలను ప్రతిబింబించేలా ఫోటోజర్నలిస్టులు సమర్పించిన ఛాయాచిత్రాలను నిపుణుల కమిటీ పరిశీలించి ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసింది. ఇందులో కుడుతాల రమేష్ సమర్పించిన ఛాయాచిత్రం రాష్ట్ర స్థాయి కన్సోలేషన్ బహుమతికి ఎంపికైంది. రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల రమేష్‌కు జర్నలిస్టులు, ఫోటోజర్నలిస్టులు, మన తెలంగాణ సిబ్బంది అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర స్థాయి బహుమతిని ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

## మన బడికి మన చేయూత

**ఐక్యత యూత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు భారీ చేయూత**

**రూ.1 లక్ష విలువైన క్రీడా సామగ్రి అందజేత**

**పదో తరగతి ప్రతిభావంతులకు పురస్కారాలు**

**చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం**

**ఐక్యత యూత్ వెల్ఫేర్ అసోసియేషన్**



కాకతీయ, చందుర్తి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు యువత ముందుకు రావాలని ఐక్యత యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చందుర్తి మండలం లింగంపేట ప్రభుత్వ పాఠశాలకు రూ.1 లక్ష విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా సామగ్రిని పాఠశాలకు అందించారు. క్రీడలతోపాటు చదువులోనూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ట్రోఫీలు అందజేశారు. చదువుకు ప్రోత్సాహం, క్రీడలకు ప్రాధాన్యం, ప్రభుత్వ పాఠశాలకు అండగా యువత అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. యువత సేవా దృక్పథంతో ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరింత తోడ్పాటు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యత యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



- సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రోల్‌మోడల్
- మన పథకాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి
- రాష్ట్రంలో 24 వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు
- ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్ర అభివృద్ధి
- వేములవాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కాకతీయ, చందుర్తి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా పేదల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి ఆది శ్రీనివాస్ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 24 వేల కొత్త కుటుంబాలకు రేషన్ కార్డులు అందించామని ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 1.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ కార్డు కేవలం సరుకుల కోసం మాత్రమే కాకుండా పేద కుటుంబాలకు ముఖ్యమైన గుర్తింపు కార్డుగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేదలు, సంపన్నులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు.

### అప్పుల భారంలోనూ సంక్షేమం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదని అన్నారు. గత పాలనలో రాష్ట్రంపై భారీగా అప్పుల భారం పడిందని, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆశిరెడ్డిపల్లితో తనకు రాజకీయంగా విడదీయరాని అనుబంధం ఉందని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. 1995లో కొచ్చెరు చెరువుకు గండి పడిన అనంతరం, తాను జడ్పీటీసీగా ఉన్న సమయంలో 1996లో పాదయాత్ర చేసి చెరువు మరమ్మతులకు రూ.45 లక్షలు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొచ్చెరు చెరువులోకి నీటిని తీసుకురావడానికి కాలువ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వేములవాడ మూడో వంతెన నిర్మాణం, రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాజన్న ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం తనకు లభించిన అరుదైన అవకాశమన్నారు. ఎన్నికలు కేవలం 15 రోజుల రాజకీయ పోటీ మాత్రమేనని, అనంతరం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. తాను 4 సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటూ 5వసారి ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం పొందానని గుర్తు చేశారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలకు తన ఎమ్మెల్యే పదవిని అంకితం చేశానని, ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వంగనూరి ఆనందరావు మాదిగ**



కాకతీయ, నల్లబెల్లి: దళితుడిని కులం పేరుతో దూషించి దాడి చేసిన మాజీ సర్పంచ్ కదుదూరి కట్టయ్యను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వంగనూరి ఆనందరావు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుండ్లపహాడ్‌లో పోచమ్మ బోనాల సందర్భంగా వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో బైరపాక సుధాకర్ అక్కడికి వచ్చారని, ఈ క్రమంలో కదుదూరి కట్టయ్య కులం పేరుతో దూషిస్తూ దాడి చేసినట్లు ఆరోపించారు. కట్టయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈసంపల్లి రాజు మాదిగ, రత్నం, కార్నేలు, ప్రతాప్, కుమార్ స్వామి, అఖిల్, సూరయ్య, రాకేష్, రాజు, పైడి, రంజిత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ రిపోర్టర్ రాంబాబును పరామర్శించిన బదావత్ రవి



కాకతీయ, సింగరేణి: ఖమ్మం జిల్లా సింగరేణి మండలం బొక్కలతండాకు చెందిన కాకతీయ రిపోర్టర్ రాంబాబును మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. బదావత్ రవి ఆదివారం పరామర్శించారు. వ్యవసాయ పనుల్లో భాగంగా పొలానికి వెళ్లిన రాంబాబు పొలం గట్లపై నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో చేతికి ఫ్యాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న డా. బదావత్ రవి రాంబాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం మిషన్ వాక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగమని డా. బదావత్ రవి తెలిపారు. పరామర్శించిన ఆయనకు రాంబాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పాడి పంటలు చల్లగా చూడాలమ్మా

**రాయపర్తిలో ఉట్టిపడిన భక్తి పారవశ్యం**

**ఘనంగా మారెమ్మ, ముత్యాలమ్మ బోనాలు**


**మారుమోగిన డప్పుచప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు**

**అమ్మవార్లకు మొక్కులు చెల్లించిన భక్తజనం**



కాకతీయ, రాయపర్తి : వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు చల్లగా ఉండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని భక్తులు గ్రామ దేవతలను వేడుకున్నారు. ఆదివారం రాయపర్తి మండల కేంద్రంలో మారెమ్మ, ముత్యాలమ్మ తల్లుల బోనాల పండగ ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించారు. మహిళలు నిష్టతో సిద్ధం చేసిన బోనాలను శిరస్సున ధరించి మంగళ వాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవార్లకు నైవేద్యంగా బోనం సమర్పించి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా చెల్లించే మొక్కుల్లో భాగంగా భక్తులు పొట్టేళ్లు, మేకలు, కోళ్లను సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ సందడి కనిపించింది. గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మిర్చి నాట్లకు ఊపొచ్చింది.. వర్షంతో రైతుల్లో ఆనందం



కాకతీయ, ఏన్కూర్: ఏన్కూర్ మండలంలో మిర్చి నాట్లు జోరందుకున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షంతో పొలాల్లో తేమ ఏర్పడి నాట్లకు భూములు అనుకూలంగా మారాయి. దీంతో శ్రీరామగిరితో పాటు పలు గ్రామాల్లో రైతులు నాట్ల పనులను వేగవంతం చేశారు. సకాలంలో వర్షం కురవడంతో మిర్చి సాగుకుఅనుకూలపరిస్థితులు ఏర్పడ్డాయనిరైతులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

- ఆర్టిజన్, అన్‌మ్యాన్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- సమస్యల సాధనకు 18న కరీంనగర్ సభను జయప్రదం చేయాలి
- టీజీయూఈఈయూ-సీఐటీయూ ఖమ్మం జిల్లా జనరల్ బాడీ




కాకతీయ, ఖమ్మం టౌన్ : విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–సీఐటీయూ ఖమ్మం జిల్లా జనరల్ బాడీ డిమాండ్ చేసింది. ఆర్టిజన్, అన్‌మ్యాన్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని కోరింది. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చింది. ప్రైవేటీకరణ వల్ల ప్రజలు, రైతులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యోగులు, కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డీ. ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులను కలుపుకొని ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమస్యల సాధన కోసం ఈ నెల 18న కరీంనగర్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె. నాగేశ్వరరావు, ఖమ్మం టౌన్ డివిజన్ అధ్యక్షుడు కె. లాలయ్య, కార్యదర్శి కె. సుధాకర్, రూరల్ డివిజన్ కార్యదర్శి సీతయ్య, మధిర డివిజన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి బి. రాజేశ్, వైరా డివిజన్ అధ్యక్షుడు అఖిశెట్టి వెంకటేశ్వర్లు, మీటర్ ఎంఆర్‌టీ డివిజన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్, కార్యదర్శి జ్యోతి, బిల్లు కలెక్టర్ల జిల్లా అధ్యక్షుడు గుండాల గురునాథం, మీటర్ రీడర్ల అధ్యక్షుడు వీరయ్య, పుల్లయ్య, మహేష్, ఆర్టిజన్ నాయకులు శ్రీకాంత్, సంధ్యారాణి, మహిళా ప్రతినిధి రాధ, సత్య, జిల్లా నాయకుడు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని సన్మానించిన బీజేపీ



కాకతీయ, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నరేష్‌ను బీజేపీ జిల్లా నాయకులు నవీన్ నాయక్, మండల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు దుంపల సందీప్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరం కాకతీయ

# పేదలకు హైటెక్ వైద్యం

**నగర నడిబొడ్డున సూపర్ స్పెషాలిటీ దవాఖాన**
**1,082 పడకలతో టిమ్స్ సనత్‌నగర్**
**300 ఐసీయూ బెడ్లతో అత్యాధునిక వైద్యం**
**31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు**
**6 విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**
**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభం**




కాకతీయ, హైదరాబాద్ : నగర నడిబొడ్డున పేదలకు సైతం హైటెక్ కార్పొరేట్ వైద్యాన్ని అందించే లక్ష్యంతో నిర్మించిన మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మహా సౌధం అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం టిమ్స్ సనత్‌నగర్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల చరిత్రలో దశలవారీ అభివృద్ధికి భిన్నంగా ఒకే మాస్టర్ ప్లాన్‌తో సింగిల్ ఫేజ్‌లో ఇంత భారీ ఆసుపత్రి నిర్మాణం జరగడం విశేషం. 22.6 ఎకరాల విస్తీర్ణంలో 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత స్థలంలో ఈ సమగ్ర వైద్య ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 1,082 పడకలు ఉండగా, 300 ఐసీయూ బెడ్లు కేటాయించారు. మొత్తం పడకల్లో దాదాపు 30 శాతం క్రిటికల్ కేర్‌కు కేటాయించడం విశేషం.31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేశారు. నిర్మాణ బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్ సంస్థ పూర్తి చేసింది.

## నాలుగు బ్లాకుల్లో సమగ్ర వైద్య సేవలు

టిమ్స్‌ను నాలుగు ప్రధాన బ్లాకులుగా నిర్మించారు. బ్లాక్ ఏలో అత్యవసర విభాగాలు, 15 ప్రధాన ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ పడకలు ఏర్పాటు చేశారు. బ్లాక్ బీలో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్, 2 క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్ సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, జనరల్ వార్డులు, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు నిర్మించారు. బ్లాక్ డీలో పరిపాలన, వైద్య విద్య బోధనతో పాటు 200 మంది సామర్థ్యంతో ఆడిటోరియం ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల చరిత్రలో తొలిసారిగా కృత్రిమ మేధతో పనిచేసే అత్యాధునిక న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రక్త నమూనాలు, కీలక ఔషధాలు, రిపోర్టులను ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌కు 1 నుంచి 2 నిమిషాల్లో చేర్చేలా ఈ వ్యవస్థను రూపొందించారు. అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దారు.

## అత్యాధునిక స్కానింగ్ సదుపాయాలు

3.0 టెస్లా ఎంఆర్ఐ, 128 స్లైస్ సీటీ స్కానర్, మహిళల కోసం ప్రత్యేక మామోగ్రఫీ యూనిట్, 5 హైటెక్ ఎక్స్‌రే యంత్రాలను ఏర్పాటు చేశారు. 17 పాథాలజీ, 12 మైక్రోబయాలజీ, 10 బయోకెమిస్ట్రీ, 5 ప్రత్యేక ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. క్యాన్సర్ చికిత్సకు లీనాక్ రేడియోథెరపీ వ్యవస్థను సిద్ధం చేశారు. రోగుల సహాయకుల కోసం జీ ప్లస్ 5 అంతస్తులతో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి బస చేసే సౌకర్యం కల్పించారు. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీ, సెంట్రల్ కిచెన్, అత్యాధునిక లాండ్రీ, వైద్య వాయు సరఫరా పైప్‌లైన్ కోసం ప్రత్యేక బ్లాకులు నిర్మించారు. ప్రాజెక్టును ఈపీసీ పద్ధతిలో చేపట్టిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ నిర్మాణ సమయంలో 35 లక్షల సురక్షిత పని గంటలను నమోదు చేసింది.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీల ఏర్పాటు



కాకతీయ, గుండాల: పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా చేపడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ, మండల కమిటీల నిర్మాణంలో భాగంగా గుండాల మండలంలో బొమ్మెర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఇసంపల్లి కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆరోగ్యశ్రీ, ఆసరా పింఛన్ల సాధనలో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలోని ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఆర్థిక అసమానతలు, అస్పృశ్యత, వివక్ష లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. సెప్టెంబరు 9న జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ మండల అధ్యక్షుడిగా తప్పెట్ల సతీష్ మాదిగ, అధికార ప్రతినిధిగా బొమ్మర్ల శ్రీను మాదిగ, ప్రధాన కార్యదర్శిగా లాలూ ప్రసాద్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కీసర వీరేంద్ర మాదిగ, బొమ్మరిల్లు శివాజీ మాదిగ, తప్పెట్ల అశోక్ మాదిగ ఎంపికయ్యారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా బొమ్మెర్ల నాగేశ్వరరావు మాదిగ, అధికార ప్రతినిధిగా కొప్పుల బాబు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర సత్యం మాదిగ, ఉపాధ్యక్షులుగా కొండ్రు లక్ష్మీ నారాయణ మాదిగ, బొమ్మర్ల కృష్ణ మాదిగ, కొప్పుల సమ్మయ్య మాదిగ, బొమ్మెర నరసింహారావు మాదిగ, కొప్పుల కన్నయ్య మాదిగ, వానపాకుల లాలయ్య మాదిగలను ఎన్నుకున్నారు.

# ముత్యాలమ్మ తల్లి బోనాలు



కాకతీయ, కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం వట్టం వారి గుంపులో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌడ్స్ కుటుంబాల వారు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, కుటుంబాల్లో సుఖసంతోషాలు నెలకొనాలని, గ్రామ ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను సమర్పించి పూజలు, నైవేద్యాలు నిర్వహించారు. పెద్దలు పాటిస్తూ వచ్చిన సంప్రదాయాన్ని నేటి తరం కొనసాగించడం ఆనందంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఉత్సవాల్లో గ్రామస్తులు, బంధువులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీడీవో ఆఫీస్ ముందే చెత్త..

# పట్టించుకునేవారేరీ?



కాకతీయ, ఏన్కూర్: ఏన్కూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ పక్కన చెత్తాచెదారం పేరుకు పోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కాంప్లెక్స్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోగా, గతంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించిన అనంతరం కొమ్మలు, చెట్ల అవశేషాలను అక్కడే పడేశారు. చెత్తాచెదారం, చెట్ల వ్యర్థాలు రోజురోజుకూ పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజలు రాకపోకలు సాగించే కార్యాలయం ఎదుటే ఈ పరిస్థితి నెలకొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తాచెదారం, చెట్ల అవశేషాలు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

# లడ్డూల నుంచి.. కోట్ల మోసం వరకు!

**కొండపల్లి గణేష్ ఎపిసోడ్‌లో విస్తుపోయే కోణాలు**
**రూ.29 లక్షలు.. రూ.51 లక్షల లడ్డూ పాటలతో హల్‌చల్**
**అధిక వడ్డీ ఆశ చూపి రూ.3.50 కోట్ల వసూళ్లు**
**ఖమ్మం.. హైదరాబాద్‌లోనూ భారీగా పెట్టుబడుల సేకరణ**
**95 మందిని ప్రతివాదులుగా చేర్చి రూ.33 కోట్ల ఐపీ దాఖలు**



కాకతీయ, హైదరాబాద్: లడ్డూ వేలం పాటలతో మొదలైన పరిచయం.. ఆ తర్వాత అధిక వడ్డీ, భారీ లాభాల ఆశ చూపుతూ పెట్టుబడుల సేకరణ.. చివరకు కోట్ల రూపాయల వ్యవహారం. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కొండపల్లి గణేష్ వ్యవహారంలో ఒక్కొక్కటిగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గచ్చిబౌలిలోని మై హోం భుజ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ అక్కడి వారితో పరిచయాలు పెంచుకున్న గణేష్.. తన ఆర్థిక స్థోమతపై నమ్మకం కలిగించేలా వ్యవహరించి, అనంతరం పెట్టుబడుల పేరుతో డబ్బులు సమీకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోనూ ఇదే తరహాలో పలువురి నుంచి భారీ మొత్తాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గణేష్ తొలుత లడ్డూ వేలం పాటలతో అందరి దృష్టినీ ఆకర్షించినట్లు సమాచారం. 2024లో ఏకంగా రూ.29 లక్షలకు లడ్డూ పాట పాడటం.. ఆ తర్వాత 2025లో రూ.51 లక్షలకు లడ్డూ వేలంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఇంత భారీ మొత్తాలు చెల్లించే స్థోమత ఉన్న వ్యక్తిగా తన చుట్టూ ఉన్నవారిలో ఒక రకమైన నమ్మకాన్ని కల్పించుకున్నాడని తెలుస్తోంది. ఆర్థికంగా బలమైన వ్యక్తిగా కనిపించడంతో అతడి మాటలను పలువురు నమ్మినట్లు సమాచారం. ఇదే పరిచయం తర్వాత పెట్టుబడుల సేకరణకు మార్గంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక వడ్డీ ఇస్తానని, తన వద్ద డబ్బులు పెడితే కొద్దికాలంలోనే భారీ లాభాలు వస్తాయని చెప్పి పలువురిని ఆకర్షించినట్లు బాధితులు చెబుతున్నారు.

## అపార్ట్‌మెంట్‌లోనే రూ.3.50 కోట్ల వ్యవహారం?

గచ్చిబౌలిలోని మై హోం భుజ అపార్ట్‌మెంట్‌లో పరిచయమైన పలువురి నుంచి గణేష్ భారీగా డబ్బులు సమీకరించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అధిక వడ్డీతో పాటు పెట్టుబడిపై గణనీయమైన రాబడి వస్తుందని నమ్మించి మొత్తాలు తీసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా అపార్ట్‌మెంట్ పరిధిలోనే సుమారు రూ.3.50 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అక్కడితో వ్యవహారం ఆగలేదని తెలుస్తోంది. ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రాంతానికి చెందిన గణేష్.. ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని కొందరు విద్యాసంస్థల నిర్వాహకులు, వైద్యులు, వ్యాపారవేత్తలను కూడా ఇదే తరహాలో సంప్రదించినట్లు సమాచారం. అధిక వడ్డీ, పెట్టుబడుల ద్వారా లాభాలు వస్తాయంటూ నమ్మించి భారీ మొత్తాలు తీసుకున్నట్లు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

## జనవరి నుంచి కనిపించకుండా పోవడంతో..

గత ఏడాది డిసెంబర్ వరకు ఖమ్మం ఉమ్మడి జిల్లా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో డబ్బుల సేకరణ సాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే జనవరి నుంచి గణేష్ అందుబాటులో లేకుండా పోవడంతో డబ్బులు ఇచ్చిన వారిలో ఆందోళన మొదలైంది. ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో అసలు వ్యవహారం ఏమిటన్నది ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏప్రిల్‌లో ఖమ్మం కోర్టులో 95 మందిని ప్రతివాదులుగా పేర్కొంటూ రూ.33 కోట్లకు సంబంధించిన ఐపీ దాఖలు చేసినట్లు సమాచారం. దీంతో అప్పటికే డబ్బులు ఇచ్చిన పలువురు బాధితులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తమ డబ్బుల పరిస్థితి ఏమిటో తెలియక పోలీసులను ఆశ్రయించడం ప్రారంభించారు. గణేష్‌పై గచ్చిబౌలి, ఖమ్మం ప్రాంతాల్లో పలు ఫిర్యాదులు, కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ కేసుల నేపథ్యంలో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ప్రస్తుతం పెట్టుబడుల పేరుతో ఎవరెవరి నుంచి ఎంత మొత్తం తీసుకున్నాడు? ఎవరికి ఎంత చెల్లించాడు? ఈ డబ్బు ఎక్కడికి మళ్లింది? మరెవరైనా ఇందులో భాగస్వాములుగా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇల్లందు ప్రాంతంలోనూ గణేష్‌పై గతంలో కేసులు ఉన్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుత వ్యవహారంతోపాటు గత లావాదేవీలు, పరిచయాలు, ఆర్థిక కార్యకలాపాలపైనా పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## 'అధిక వడ్డీ' ఆశ.. అసలు ముప్పు!

ఈ వ్యవహారం మరో విషయాన్ని కూడా స్పష్టం చేస్తోంది. సాధారణ పెట్టుబడుల కంటే అసాధారణ స్థాయిలో వడ్డీ ఇస్తామంటూ ఎవరైనా నమ్మించే ప్రయత్నం చేస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వ్యక్తి ఆర్థిక స్థోమత, పరిచయాలు, ఖరీదైన జీవనశైలి చూసి పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. లడ్డూ వేలంలో భారీ మొత్తాలు.. ఆ తర్వాత అధిక వడ్డీ ఆశలు.. కోట్ల రూపాయల పెట్టుబడులు.. చివరకు కేసులు, అరెస్టు, ఐపీ వ్యవహారం.. కొండపల్లి గణేష్ ఎపిసోడ్ ఇప్పుడు ఇదే క్రమంలో ఆసక్తికరంగా మారింది. అసలుఎంత మొత్తంలోడబ్బు సమీకరించారు? ఎంతమంది బాధితులు ఉన్నారు? డబ్బు ఎక్కడికి మళ్లింది? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# ఓబీసీలను జనగణనలో విస్మరిస్తారా

- బీసీలను పక్కనపెట్టడం సామాజిక న్యాయానికి విఘాతం
- 40 ప్రశ్నల్లోనూ ఓబీసీలకు చోటేది
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం
- తెలంగాణ బీజేపీ నేతలు కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు
- వివక్షపై జాతీయ ఉద్యమానికి సిద్ధం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కాకతీయ, హైదరాబాద్ : దేశంలో అత్యధికంగా ఉన్న ఓబీసీలను జాతీయ జనగణనలో అధికారికంగా గుర్తించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలనే పక్కన పెడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. స్వయంగా బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో బీసీల సంక్షేమానికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతికి సరైన కార్యాచరణ చేపట్టకుండా కేంద్రం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఓబీసీల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 2025 ఏప్రిల్‌లో చేపట్టిన ప్రారంభ సర్వే కసరత్తులో 32 ప్రశ్నలతో రూపొందించిన దరఖాస్తులో 13వ కాలమ్‌లో ఎస్సీ, ఎస్టీ వివరాలకు అవకాశం కల్పించి ఓబీసీల వివరాలను విస్మరించారని మంత్రి తెలిపారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీకి వినతిపత్రం సమర్పించారని గుర్తు చేశారు. రెండో విడతలో బీసీల గణాంకాలు సేకరిస్తామని హామీ ఇచ్చినా, ఆగస్టు 15న విడుదల చేసిన 40 ప్రశ్నల జాబితాలోనూ ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేకపోవడం కేంద్రం కపట వైఖరికి నిదర్శనమన్నారు.

## కులగణనతోనే రిజర్వేషన్లకు ఆధారం

సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అధిగమించాలంటే అధికారిక సామాజిక గణాంకాలు అవసరమని పొన్నం ప్రభాకర్ అన్నారు. శాస్త్రీయ కులగణన జరిగితేనే కోర్టులకు ప్రామాణిక సమాచారం అందించగలమన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్ నినాదం సాకారం కావాలంటే దేశవ్యాప్తంగా కులగణన తప్పనిసరిగా జరగాలని స్పష్టం చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు దక్కాలంటే ప్రతి కులం సంఖ్య స్పష్టంగా తేలాల్సి ఉందన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే బీసీలను ఉపయోగించుకుంటున్నారని మంత్రి ఆరోపించారు. బలహీన వర్గాల రాజ్యాంగబద్ధ హక్కుల కోసం కేంద్రం వద్ద వారు నోరు మెదపడం లేదని విమర్శించారు. చండీగఢ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరైన సమావేశ వేదికను బీజేపీ నాయకులు శుద్ధి చేయడాన్ని అనాగరిక చర్యగా అభివర్ణించారు. సీనియర్ దళిత ప్రజాప్రతినిధి పట్ల ఇలాంటి వివక్ష చూపడం మనువాద ధోరణికి నిదర్శనమన్నారు. కేంద్రం వెంటనే 40 ప్రశ్నల సర్వే జాబితాను సవరించి ఓబీసీల వివరాల నమోదుకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి సమగ్ర లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక సర్వే దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. కేంద్రం వైఖరి మార్చుకోకపోతే బడుగు, బలహీన వర్గాలతో కలిసి జాతీయ స్థాయిలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# విదేశీ బాట ఎందుకు?

**ప్రపంచస్థాయి కాలేజీలు లేకేనా?**
**కేటీఆర్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు**
**ఐఐటీలు.. ఐఐఎంలు.. ఐఐఎస్సీ వంటి సంస్థలు లేవా?**
**విద్యా ప్రమాణాల మెరుగుదలతోనే 'బ్రెయిన్ డ్రెయిన్'కు అడ్డుకట్ట**



కాకతీయ, హైదరాబాద్ : దేశంలో ప్రపంచస్థాయి ఉన్నత విద్యా సంస్థలు తగిన సంఖ్యలో లేకపోవడం వల్లే విద్యార్థులు విదేశాల బాట పడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యా వసతులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురాలేకపోవడం బాధాకరమని ఆయన అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్య, ఆధునిక పరిశోధనా సదుపాయాలు, మెరుగైన ఉద్యోగ అవకాశాలు దేశంలోనే అందుబాటులో ఉంటే యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. తన కుమార్తె ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన ప్రముఖ విద్యా సంస్థలు దేశంలో తగినన్ని అందుబాటులో లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పారు. రాజకీయాల్లో కుల, మత అంశాలకు ఇచ్చే ప్రాధాన్యాన్ని విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి పరిశోధనా ప్రయోగశాలలు, ఆధునిక సాంకేతిక వనరులు, ప్రాక్టికల్ ఎడ్యుకేషన్‌ను పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించినప్పుడే దేశీయ విద్యా సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలవని ఆయన పేర్కొన్నారు. యువత ప్రతిభను దేశంలోనే వినియోగించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

## ఐఐటీలు.. ఐఐఎంల సంగతేంటి?

అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్‌లో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్సీ వంటి ప్రపంచస్థాయి విద్యా సంస్థలు ఉన్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. దేశంలోనే చదివి అంతర్జాతీయ సంస్థల్లో అత్యున్నత స్థానాలకు ఎదిగిన భారతీయుల సంఖ్య భారీగా ఉందని పేర్కొంటున్నారు. మొత్తం భారత విద్యా వ్యవస్థను లోపభూయిష్టంగా చిత్రీకరించడం సరికాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో కేటీఆర్ లేవనెత్తిన అంశంలో వాస్తవం కూడా లేకపోలేదన్న వాదన వినిపిస్తోంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యకు కేవలం కాలేజీల కొరతే కారణం కాదు. అధునాతన పరిశోధన, అంతర్జాతీయ ఎక్స్‌పోజర్, మెరుగైన ఉద్యోగ అవకాశాలు, అధిక వేతనాలు, గ్లోబల్ నెట్‌వర్కింగ్ వంటి అంశాలు కూడా విదేశీ విద్యకు ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో చదువుతోపాటు అంతర్జాతీయ పని అనుభవం పొందే అవకాశం యువతను ఆకర్షిస్తోంది.

## మారాల్సింది విద్యా వ్యవస్థే..

దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్సీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నప్పటికీ.. వాటి స్థాయిలో నాణ్యమైన విద్య, పరిశోధనా వసతులు అన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న. ఉన్నత విద్యలో నాణ్యతను కొన్ని ప్రముఖ సంస్థలకే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశోధనా కేంద్రాలు, డిజిటల్ విద్య, నూతన సాంకేతికత, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెడుతున్నాయి. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ మార్పులు వేగం పుంజుకుంటే దేశీయ విద్యా రంగంలో పోటీ, నాణ్యత పెరిగే అవకాశం ఉంది. విద్యార్థులు విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవడం పరిష్కారం కాదు. విదేశాలకు వెళ్లినా తిరిగి రావాలనిపించే స్థాయి అవకాశాలను దేశంలో సృష్టించడమే అసలు లక్ష్యం కావాలి. ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, ఉపాధి అవకాశాలు స్వదేశంలోనే అందుబాటులోకి వస్తే ప్రతిభావంతుల వలసను తగ్గించడంతోపాటు భారత యువత సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

# పీహెచ్సీలో వైద్య సేవలు శూన్యం



- అత్యవసర వేళల్లో అందుబాటులో ఉండని వైద్యులు
- ఆదివారం కూడా ఆసుపత్రికి తాళం వేస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామీణ రోగులు
- కుక్క కాటుకు గురైన ఇద్దరు పిల్లలు.. ఎంజిఎం ఆసుపత్రికి పరుగులు





కాకతీయ,రాయపర్తి : గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యానికి నిలయంగా మారింది.అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండకపోవడం,ఆదివారం వచ్చిందంటే ఆసుపత్రికి పూర్తిగా తాళం వేసి ఉంచడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదాలు జరిగినప్పుడు, హఠాత్తుగా అనారోగ్యానికి గురైనప్పుడు పిహెచ్సికి వస్తే వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.ఆదివారం ఉదయం మండల కేంద్రంలో పిచ్చి కుక్క దాడిలో ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడగా,చికిత్స కోసం స్థానిక పిహెచ్సికి తరలించారు.అయితే ఆసుపత్రికి తాళాలు వేసి ఉండడంతో ఏం చేయాలో పాలు పోక బాధితుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

### తీవ్ర రక్తస్రావం... అందని చికిత్స

భాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం ఉదయం రాయపర్తిలో ఆకారపు విరాట్,మహ్మద్ అశ్రఫ్ ఇద్దరు పిల్లలపై పిచ్చికుక్క దాడి చేసే తీవ్రంగా గాయపరిచింది.తీవ్ర రక్తస్రావంతో అల్లాడుతున్న పిల్లలను వెంటనే ప్రాథమిక చికిత్స ఆంటీ రేబిస్(కుక్క కాటు) టీకా కోసం స్థానిక పీహెచ్సీకి తరలించమన్నారు.అయితే..ఆ సమయానికి ఆసుపత్రికి పూర్తిగా తాళాలు వేసి ఉన్నాయి. డాక్టర్లు కానీ కనీసం నర్సింగ్ సిబ్బంది కానీ అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసాయి.చేసేదేమి లేక ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి టీకాలు వేయించినట్లు తెలిపారు.

### సెలవు రోజుల్లో సేవలు శూన్యం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటల ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలి కానీ... రాయపర్తి పి హెచ్సిలో అది పూర్తిగా భిన్నంగా మారింది.ఆదివారం వచ్చిందం టే ఆసుపత్రికి తాళాలు వేయడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.సమయానికి వైద్యం అందక రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు,సూదుర పట్టణాలకు తరలించాల్సి వస్తుందని వాపోతున్నారు.

### చర్యలు తీసుకోవాలి..

ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని,రాయపర్తి మండలంలో 24 గంటలు అత్యవసర సేవలు రోగులకు అందేలా చూడాలని స్థానికులు, బాధిత తల్లిదండ్రులు ఆకారపు విష్ణు, మొహమ్మద్ సాదిక్ డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలేవి?

**90 రోజులుగా జీతాలు లేక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అవస్థలు**

**పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి**

**లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**

**సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్**



కాకతీయ, కారేపల్లి : ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కారేపల్లి–కామేపల్లి సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ అన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్స్ ఆపరేటర్లు, అటెండర్లు, ఏపీవోలు, ఈసీలు, డ్రైవర్లు తదితరులకు రెండు, మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని శివ నాయక్ తెలిపారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న ఇతర అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సైతం సుమారు 90 రోజులుగా జీతాలు అందక కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, నిత్యావసరాల భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### సాంకేతిక కారణాలు చెప్పడం సరికాదు

ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా ఆచరణలో పరిస్థితి భిన్నంగా ఉందని విమర్శించారు. వేతనాల చెల్లింపులో సాంకేతిక కారణాలను చూపుతూ ఉద్యోగుల కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే ఒకేసారి విడుదల చేయాలని శివ నాయక్ డిమాండ్ చేశారు. వేతనాలు వెంటనే చెల్లించకపోతే జిల్లా, మండల, రాష్ట్ర స్థాయిలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు భాగ్య, అరుణోదయ కళాకారులు దంతాల నారాయణ, పార్టీ జిల్లా నాయకులు కోటక్క, ఈసం శ్రీను, రాధక్క, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ ప్రగతి గాథను ఆవిష్కరించిన సీఎం

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సావనీర్ విడుదల చేసిన రేవంత్ రెడ్డి**

**వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబాటు**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్‌ను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పరకాల పర్యటనలో ఆవిష్కరించారు.

### అభివృద్ధి పనుల సంపూర్ణ దస్తావేజు

బల్దియా పరిధిలో చేపట్టిన మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, పచ్చదనం పెంపుతో పాటు పట్టణ పేదల సంక్షేమం, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం వంటి కార్యక్రమాల వివరాలను ఫోటోలతో సహా ఈ సావనీర్‌లో పొందుపరిచారు. ఈ సావనీర్‌ను రూపొందించిన అధికారులు, సిబ్బందిని సీఎం అభినందించారు. వరంగల్ మహానగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు చేరువ చేయడంలో ఇటువంటి ప్రచురణలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ డా కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, మాజీ మేయర్ గుండు సుధారాణిలకు సావనీర్ ప్రతులను సీఎం అందజేశారు. కార్యక్రమంలో జిడబ్ల్యూఎంసి ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గురుకులంలో విద్యార్థులపై దాడి దుర్మార్గం

**బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి**

**విద్యార్థుల భద్రతపై యాజమాన్యం నిర్లక్ష్యం**

**పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, జీవీఎస్ డిమాండ్**

**గురుకులం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా**



కాకతీయ, కారేపల్లి : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు దాడికి పాల్పడటం దుర్మార్గమని పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, జీవీఎస్ విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు దాడి చేసినట్లు తెలిపారు. వేధింపులు, దాడులతో భయాందోళనకు గురైన విద్యార్థులు రాత్రివేళ సమీపంలోని అటవీ ప్రాంతంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన గురుకుల యాజమాన్యం పర్యవేక్షణలోపం వల్లే ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జి. మస్తాన్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్, జీవీఎస్ నాయకుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ దాడి జరిగిన సమయంలో వార్డెన్, ప్రిన్సిపాల్ పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనను నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకులం ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత విద్యార్థులకు వైద్యం, కౌన్సెలింగ్ అందించాలని, గురుకులంలో పూర్తిస్థాయి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

## నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగం..?

- ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్
- ఏజెన్సీ సర్టిఫికెట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు
- గిరిజన గురుకుల ఉపాధ్యాయురాలిపై సమగ్ర విచారణకు డిమాండ్



కాకతీయ,మహబూబాబాద్ : నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్, హిందీ పండిట్ శిక్షణ ధ్రువపత్రం సమర్పించి ప్రభుత్వ ఉద్యోగం పొందారనే ఆరోపణలపై గిరిజన గురుకుల ఉపాధ్యాయురాలిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం దామరవంచ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గతంలో గూడూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేశారని తెలిపారు. తన ఫిర్యాదుపై జిల్లా విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విచారణకు ఆదేశించినట్లు రామన్న నాయక్ తెలిపారు. జూలై 27, 2026న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి జారీ చేసిన లేఖలో ఏజెన్సీ సర్టిఫికెట్‌పై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 2026లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి కూడా సర్టిఫికెట్ల అసలుదనంపై విచారణకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు.

### సర్టిఫికెట్లపై స్పష్టత ఇవ్వాలి

ఏజెన్సీ సర్టిఫికెట్ అసలుదనం, హిందీ పండిట్ శిక్షణ ధ్రువపత్రం చెల్లుబాటు, వాటిని జారీ చేసిన సంస్థలు, నియామక ప్రక్రియ, విద్యార్హతలు, సర్వీస్ రికార్డులను పరిశీలించాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. అయితే విచారణకు ఆదేశాలు జారీ అయినా ఇప్పటివరకు పూర్తిస్థాయి నివేదిక వెల్లడించకపోవడంపై రామన్న నాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు నిజమైనవా, నకిలీవా అనే విషయాన్ని సంబంధిత సంస్థలు, అధికారుల ద్వారా అధికారికంగా ధ్రువీకరించాలని కోరారు. సర్టిఫికెట్లు నకిలీవని తేలితే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ పూర్తి చేసి తుది నివేదికను ఫిర్యాదుదారుడికి అందజేయాలని కోరారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై మోదీ ఫొటో తప్పనిసరి



- కేంద్రం బియ్యాన్ని రాష్ట్రం తన ఖాతాలో వేసుకోవడం సరికాదు
- రాజకీయాలు చేస్తే కాంగ్రెస్ సర్కార్‌కు మూల్యం తప్పదు
- బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

కాకతీయ, శంకరపట్నం : కేంద్ర ప్రభుత్వ సహకారంతో పేదలకు అందుతున్న రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తానే అందిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తగదని బోయినపల్లి ప్రవీణ్ రావు విమర్శించారు. ఆదివారం శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అందుతున్న రేషన్ బియ్యంలో 5 కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న సాయాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం బియ్యం అందిస్తున్నట్లుగా ప్రజల్లో భ్రమలు కల్పించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు. అలాంటప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులపై కేవలం ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు మాత్రమే ముద్రించడం సమంజసం కాదన్నారు. రేషన్, సంక్షేమ పథకాల విషయంలో అనవసర రాజకీయాలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బోయినపల్లి ప్రవీణ్ రావు హెచ్చరించారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, సీనియర్ నాయకులు దొంగల రాములు, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, నిమ్మచెట్టి సంపత్, రాసమల్ల శ్రీనివాస్, చెర్ల శ్రీనివాస్, కనకం సాగర్, బిజిలి సారయ్య, కనకం కుమార్, గూళ్ల రాజు, వడ్లకొండ రాజేందర్, మొలుగూరి ప్రశాంత్, మెడిశెట్టి రాజేష్, గొల్లపల్లి వెంకటేష్, బొంతల రవి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీవో కార్యాలయాల ఎదుట నేడు

## బీఆర్ఎస్ ధర్నా

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై నేడు బీఆర్ఎస్ నిరసనలు**

**హైకోర్టు స్టేపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**

**పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్**

కాకతీయ,తెలంగాణ బ్యూరో : బీఆర్ఎస్ పిలుపుతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పథకాలపై హైకోర్టు స్టే విధించిందని బీఆర్ఎస్ ఆరోపించింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. పేద కుటుంబాలకు అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం సరికాదని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాయపర్తిలో ప్రజావాణికి సర్వం సిద్ధం

**- మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారం**

**- 22 శాఖల అధికారులకు ఒకే చోట దరఖాస్తులు**

**- ఎంపీడీవో పాక శ్రీనివాసులు**



కాకతీయ,రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నేడు (సోమవా రం) తో ప్రారంభం అవుతుందని ఎంపీడివో పాక శ్రీనివాసులు అన్నారు.మండల స్థాయిలోనే ప్రజా సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు.. ఎంపీడీవో మాట్లాడుతూ.. దరఖాస్తుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని స్పష్టం చేశారు.సోమవారం ఉదయం 10 గంటల నుండి 1:00 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తామని అన్నారు.ప్రజలు తమ సమ స్యలు, దరఖాస్తుల కోసం ఇక నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేద న్నారు. మండల పరిధిలోని రెవెన్యూ,పంచాయతీరాజ్, వ్యవసా యం, విద్యు త్తు, పోలీసు,విద్యా,వైద్య ఆరోగ్య శాఖలతో పాటు దాదాపు 22 ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటారని అన్నారు.ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీల తో వచ్చి ప్రజావాణిలో అధికారులకు నేరుగా విన్నవించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

### ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు

## సద్వినియోగం చేసుకోవాలి..

**- ప్రతి సోమవారం మండల పరిషత్ లో ప్రజావాణి**

**- ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి..**

కాకతీయ,ఆత్మకూరు: ప్రజావాణి కార్యక్రమాన్ని ఆత్మకూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక్క ప్రకటలో తెలిపారు.ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం కొరకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మండల అన్ని శాఖల అధికారులు కృషి చేస్తారని తెలిపారు.జిల్లా స్థాయిలో వచ్చే దరఖాస్తులను కూడా తీసుకొని సంబంధిత అధికారులకు పంపించి ప్రజలకు సత్వర న్యాయం చెప్పాడుతామణి ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## డెడ్ డ్రాప్ గంజాయి కేసులో కీలక విషయాలు

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా
- నిందితులుగా ఐదుగురు.. 29 మంది సరఫరాదారులతో సంబంధాలు
- ప్రధానంగా 7 మంది నుంచి కొనుగోళ్లు
- 225 మంది వినియోగదారుల గుర్తింపు
- యూపీఐ చెల్లింపులతో గంజాయి విక్రయాలు


కాకతీయ, తెలంగాణబ్యూరో : హైదరాబాద్ డెడ్ డ్రాప్ గంజాయి కేసులో నిందితుల రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఐదుగురిని నిందితులుగా చేర్చిన పోలీసులు.. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేసినట్లు గుర్తించారు. దర్యాప్తులో నిందితులకు సుమారు 29 మంది సరఫరాదారులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ప్రధానంగా 7 మంది సరఫరాదారుల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం దాన్ని హైదరాబాద్‌లో వినియోగదారులకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గంజాయి కొనుగోళ్లు, విక్రయాలకు సంబంధించిన లావాదేవీలు యూపీఐ చెల్లింపుల ద్వారా జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు 225 మంది గంజాయి వినియోగదారులను గుర్తించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

కాకతీయ
సినిమా
సోమవారం
17 ఆగస్టు 2026

# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు

**రెండు రోజుల్లోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లు**

**కాకతీయ, సినిమా :** కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. డీసెంట్ బజ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. సూర్యకు సరైన కథ పడితే ఫలితం ఎలా ఉంటుందో ఈ చిత్రం మరోసారి నిరూపిస్తోందని అభిమానులు అంటున్నారు. విడుదలైన రెండే రోజుల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు వసూళ్ల రూపంలోనూ కనిపిస్తున్నాయి. సినిమాలో సూర్య పోషించిన సంజయ్ విశ్వనాథ్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు తెలుస్తోంది.




**ఆదివారం మరింత జోరు..**

వీకెండ్ కావడంతో ఆదివారం వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక్క రోజులోనే మరో రూ.50 కోట్ల గ్రాస్ సాధించినా ఆశ్చర్యపోనవసరం లేదని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే జోరు కొనసాగితే సినిమా సులభంగానే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్యకు మాస్ ఇమేజ్‌తో పాటు క్లాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆ రెండు వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండటంతో వసూళ్లు పెరుగుతున్నాయి. చివరకు ఈ సినిమా ఎంతటి వసూళ్లను రాబడుతుందనేది ఆసక్తికరంగా మారింది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మమితా బైజు కథానాయికగా నటించిన ఈ సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# రామాయణ బడ్జెట్‌పై యష్ క్లారిటీ

- రూ.4 వేల కోట్లు ఒక్క సినిమాకే కాదు
- రెండు భాగాలతోపాటు విడుదల, ప్రమోషన్ల ఖర్చులూ అందులోనే

**కాకతీయ, సినిమా :** కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతుండగా.. ఆయన కీలక పాత్రలో కనిపించనున్న 'రామాయణ'పైనా భారీ అంచనాలు నెలకొన్నాయి. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ వరల్డ్ చిత్రానికి రూ.4 వేల కోట్ల బడ్జెట్ అంటూ నిర్మాత నమిత్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. తాజాగా ఈ భారీ బడ్జెట్‌పై యష్ స్పష్టత ఇచ్చారు. 'రామాయణ' రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. రూ.4 వేల కోట్ల మొత్తం బడ్జెట్ ఒక్క భాగానికో, ఒక్క సినిమాకో సంబంధించినది కాదని యష్ తెలిపారు. రెండు భాగాల నిర్మాణ వ్యయంతోపాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల, ప్రమోషన్లకు అయ్యే ఖర్చులను కూడా కలిపి ఈ మొత్తాన్ని పేర్కొన్నట్లు వివరించారు. ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని హాలీవుడ్ స్థాయిలో సినిమా నిర్మాణం, విడుదల, ప్రచారాన్ని చేపడుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో భారీగా రూపొందుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా కనిపించనున్నారు. 'రామాయణ' తొలి భాగం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మళ్లీ యూజీసీనెట్

- ఇంగ్లిష్, కామర్స్, సోషల్ సైన్సెస్‌కు పునః పరీక్ష
- ప్రశ్నపత్రాల్లో కీలక లోపాలు గుర్తింపు
- సెప్టెంబర్ 9, 10 తేదీల్లో పరీక్షల నిర్వహణ
- అభ్యర్థుల నుంచి అదనపు ఫీజు వసూలు లేదు
- మిగతా 84 సబ్జెక్టుల ఫలితాలు యథావిధిగా
- జాతీయ పరీక్షల సంస్థ ప్రకటన

**కాకతీయ, హైదరాబాద్:** యూజీసీనెట్ జూన్ 2026 పరీక్షల్లో ఇంగ్లిష్, వాణిజ్యం, సామాజిక శాస్త్రం ప్రశ్నపత్రాల్లో కీలక లోపాలు ఉన్నట్లు గుర్తించడంతో ఆ మూడు పేపర్లను పునః నిర్వహించాలని జాతీయ పరీక్షల సంస్థ నిర్ణయించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన కమిటీ ప్రశ్నపత్రాల్లో వాస్తవ, ముద్రణ, అనువాదపరమైన తప్పిదాలతో పాటు పలు ప్రశ్నల్లో స్పష్టత లోపించిందని గుర్తించింది. పరీక్ష అనంతరం ప్రభావిత ప్రశ్నలను తొలగించడం ద్వారా సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని భావించిన సంస్థ పునః పరీక్షకు నిర్ణయించింది. ఇంగ్లిష్ పరీక్షను సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, వాణిజ్య పరీక్షను అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. సామాజిక శాస్త్రం పరీక్షను సెప్టెంబర్ 10న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు.

**ప్రశ్నపత్రాల్లో పలు లోపాలు**

కమిటీ పరిశీలనలో ప్రశ్నపత్రాల్లో వాస్తవ, టైపోగ్రాఫికల్ పొరపాట్లు, అనువాద సమస్యలు, ప్రముఖ పండితుల పేర్లు లేకపోవడం, పుస్తకాల శీర్షికల్లో గందరగోళం, కొన్ని ప్రశ్నల పదబంధాల్లో లోపాలను గుర్తించింది. వ్యాకరణ, సంఖ్యాపరమైన తప్పిదాలు, స్పష్టత లేని ఎంపికలు, స్థిరమైన భావాలకు సంబంధించి అసాధారణ పదాల వినియోగం, ప్రశ్నలు లేదా ఎంపికల పునరావృతం వంటి అంశాలను కూడా కమిటీ గుర్తించింది. పునః నిర్వహించే మూడు పేపర్లకు అభ్యర్థులు అదనపు పరీక్షా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని జాతీయ పరీక్షల సంస్థ స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాలు, అడ్మిట్ కార్డులకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రత్యేకంగా వెల్లడించనున్నారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, పీహెచ్‌డీ ప్రవేశానికి అర్హతను నిర్ధారించేందుకు జూన్ 22 నుంచి జూన్ 30 వరకు 85 సబ్జెక్టుల్లో యూజీసీనెట్ పరీక్షలు నిర్వహించారు. మిగతా 84 సబ్జెక్టుల ఫలితాలను ప్రణాళిక ప్రకారం ప్రకటించనున్నారు. ఈ మూడు పేపర్ల పునః పరీక్ష వాటి ఫలితాలపై ప్రభావం చూపదని సంస్థ తెలిపింది. ఇంగ్లిష్, వాణిజ్యం, సామాజిక శాస్త్రం పునః పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించే వారి సంఖ్య ఆయా పరీక్షలకు హాజరైన అభ్యర్థుల 6 శాతానికి సమానంగా ఉంటుంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశానికి విషయ, వర్గాల వారీగా అర్హత కేటాయింపులు నిర్దేశిత నిబంధనల ప్రకారం చేపడతామని జాతీయ పరీక్షల సంస్థ తెలిపింది.




# ఫంక్షన్లకు వెళ్లడం నచ్చదు.. అది నా నేచర్: రవితేజ

**కాకతీయ, సినిమా :** బయట తక్కువగా కనిపించడంపై హీరో రవితేజ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు బయటకు రావడం, ఫంక్షన్లకు వెళ్లడం పెద్దగా ఇష్టం ఉండదని, అది తన నేచర్ అని స్పష్టం చేశారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమతో కలిసి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. విజయ్ దేవరకొండ-రష్మిక రిసెప్షన్‌కు రవితేజ సింపుల్‌గా హాజరుకావడం వైరల్‌గా మారిన విషయాన్ని యాంకర్ ప్రస్తావించారు. "మీరు బయట ఎందుకు తక్కువగా కనిపిస్తారు?" అని ప్రశ్నించారు. దీనికి రవితేజ స్పందిస్తూ.. "నాకు బయటకు రావడం, అలాగే ఫంక్షన్స్‌కు వెళ్లడం నచ్చదు. అది నా నేచర్. దానికి వేరే కారణం అంటూ ఏమీ లేదు" అని తెలిపారు.

**భిన్నమైన పాత్రలో..**

ఇక 'ఇరుముడి'లో రవితేజ తన కెరీర్‌లోనే భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు చేసిన రెగ్యులర్ మాస్ పాత్రలకు భిన్నంగా భావోద్వేగాలతో కూడిన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ముఖ్యంగా ఫాదర్-డాటర్ ఎమోషన్‌తో సాగే సన్నివేశాలు సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు సమాచారం. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. బేబీ నకాస్త్ర రవితేజ కుమార్తెగా కనిపించనుంది. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధాన్ని ప్రతిబింబించే సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసేలా ఉంటాయని చిత్రబృందం చెబుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంలో 'ఇరుముడి కట్టు' పేరుతో ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజను మాస్ ఇమేజ్‌కు భిన్నంగా భావోద్వేగభరిత పాత్రలో చూపించనుండటంతో సినిమాపై ఆసక్తి నెలకొంది.

# ఆర్టికల్ 370తో పీవోకే విలీనానికి లింకేంటి?

- 370 రద్దు చేయకపోతే పీవోకే భారత్‌లో కలిసేదా?
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆర్థిక సంక్షోభం
- పాకిస్తాన్ సైనిక వ్యవస్థపై ప్రజల తిరుగుబాటు
- 370 రద్దుతో కశ్మీర్‌లో మారిన పరిస్థితులు
- భారత్ అభివృద్ధే పీవోకే ప్రజలకు ఆకర్షణ
- కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలపై చర్చ

**న్యూ ఢిల్లీ :** ఆర్టికల్ 370 రద్దు చేయకపోతే పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు భారతదేశంలో కలవాలని ఆందోళనలు చేసేవారని కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఆర్టికల్ 370 ఉన్న కాలాన్ని ప్రజాస్వామ్య నమూనాగా చిత్రీకరించి, దాన్ని రద్దు చేయడం వల్ల పీవోకే ప్రజలు భారత్‌లో కలిసేందుకు వెనుకాడుతున్నారనే భావన కల్పించడం సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి. పీవోకేలోని ప్రజలు భారత్‌లో కలవాలనుకుంటే ఆర్టికల్ 370 రద్దు ఎలాంటి అడ్డంకిగా నిలవదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం, ఆహార కొరత, అధిక పన్నుల భారం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాకిస్తాన్ సైనిక వ్యవస్థపై వ్యతిరేకత పెరుగుతూ నిరసనలు జరుగుతున్నాయి. అయితే చారిత్రకంగా పీవోకే ప్రజల్లో రెండు కశ్మీర్‌లు కలిసి స్వతంత్రంగా ఉండాలనే భావన కూడా ఉన్నదని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. భారత్‌లో విలీనం కావాలనే అభిప్రాయం అన్ని వర్గాల్లో ఏకాభిప్రాయంగా ఉందని చెప్పలేమని పేర్కొంటున్నారు.

**370 రద్దుతో మారిన ప్రాధాన్యతలు**

2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూ కశ్మీర్‌కు భారత రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో వర్తింపజేసిన తర్వాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. రహదారులు, రైల్వేలు, పర్యాటకం, మౌలిక వసతులు, ఆర్థిక కార్యకలాపాలపై భారత్ వైపు వేగంగా దృష్టి సారించింది. దీంతో భారత్ నియంత్రణలోని కశ్మీర్, పీవోకే మధ్య అభివృద్ధి, ఆర్థిక పరిస్థితుల్లో తేడా మరింత స్పష్టమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పీవోకే ప్రజలు భవిష్యత్తులో భారత్ వైపు చూడడానికి ప్రత్యేక చట్టాల కంటే ఆర్థిక భద్రత, అభివృద్ధి, మౌలిక వసతులు, మెరుగైన జీవన ప్రమాణాలు ప్రధాన కారణాలుగా మారే అవకాశం ఉందని విశ్లేషణలు చెబుతున్నాయి. ఆర్టికల్ 370కు, పీవోకే విలీనానికి నేరుగా సంబంధం లేదనే వాదనను ఈ నేపథ్యంలో ముందుకు తెస్తున్నారు. పీవోకేలో నెలకొన్న సంక్షోభానికి పాకిస్తాన్ ఆర్థిక వైఫల్యం, రాజకీయ అస్థిరత, సైనిక జోక్యం ప్రధాన కారణాలుగా విమర్శలు ఉన్నాయి. భవిష్యత్తులో ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలు మారితే పీవోకే ప్రజల ఆకాంక్షలు కూడా మారే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పీవోకే భవిష్యత్తు, భారత్‌తో దాని సంబంధం వంటి అంశాలు సంక్లిష్టమైన రాజకీయ, దౌత్య, భద్రతా పరిణామాలతో ముడిపడి ఉన్నందున వాటిపై తుది అంచనాలు వేయడం ఇప్పుడే సాధ్యం కాదు.

# డబ్ల్యూటీసీ రేసులో ఆసక్తికర మలుపు




## భారత్‌కు పెరిగిన టెన్షన్

**కాకతీయ, స్పోర్ట్స్ డెస్క్ :** ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మధ్య డార్విన్‌లో జరిగిన తొలి టెస్టు ఫలితంతో 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆస్ట్రేలియాను తొమ్మిది వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు చేయడంతో ఆసీస్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ.. పాయింట్ పర్సంటేజీ గణనీయంగా తగ్గింది. మరోవైపు బంగ్లాదేశ్ నాలుగో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. దీంతో ఫైనల్ రేసు ఉత్కంఠగా మారింది. డార్విన్ టెస్టుకు ముందు 87.50 పర్సంటేజీతో ఉన్న ఆస్ట్రేలియా.. ఓటమి తర్వాత 77.78 శాతానికి పడిపోయింది. అయినప్పటికీ పట్టికలో మొదటి స్థానాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఆసీస్ 9 టెస్టుల్లో 7 విజయాలు, 2 ఓటములతో 77.78 పర్సంటేజీ సాధించింది. రెండో స్థానంలో దక్షిణాఫ్రికా 75 శాతంతో ఉండగా.. న్యూజిలాండ్ 72.22 శాతంతో మూడో స్థానంలో ఉంది. దీంతో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు, దక్షిణాఫ్రికాకు మధ్య అంతరం కేవలం 2.78 శాతానికి తగ్గింది. ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక విజయం బంగ్లాదేశ్‌కు డబ్ల్యూటీసీలో భారీ ప్రయోజనం కలిగించింది. డార్విన్ టెస్టుకు ముందు 58.33 పర్సంటేజీతో ఉన్న బంగ్లా.. విజయంతో 66.67 శాతానికి చేరుకుంది. దీంతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. భారత్ 48.15 శాతంతో ఐదో స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ ఆస్ట్రేలియా గడ్డపై సాధించిన తొలి టెస్టు విజయం కావడం ఈ విజయానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది.

**భారత్-శ్రీలంక టెస్టుపై ఆసక్తి**

ఇక భారత్, శ్రీలంక మధ్య గాలెలో తొలి టెస్టు కొనసాగుతోంది. ఆగస్టు 15న ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో రెండో రోజు ముగిసే సమయానికి భారత్ 460/9తో భారీ స్కోరు సాధించింది. దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో మెరిశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ విజయం సాధిస్తే పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే కొనసాగుతూ పర్సంటేజీని మెరుగుపర్చుకునే అవకాశం ఉంది. అదే సమయంలో ఈ సిరీస్‌లో భారత్‌కు ప్రతి టెస్టు కీలకంగా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే మిగిలిన మ్యాచ్‌ల్లో సాధ్యమైనంత ఎక్కువ విజయాలు సాధించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో ఫలితం భారత్ భవిష్యత్ అవకాశాలపై ప్రభావం చూపనుంది. డార్విన్ టెస్టులో బంగ్లాదేశ్ మొదటి నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 198 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం తంజిద్ హసన్ సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్ 426 పరుగులు చేసి 228 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కామెరాన్ గ్రీన్ సెంచరీతో ఆస్ట్రేలియా 284 పరుగులు చేసినా.. బంగ్లాదేశ్ ముందు 57 పరుగుల స్వల్ప లక్ష్యమే నిలిచింది. దాన్ని కేవలం 14.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించి తొమ్మిది వికెట్ల చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్టు ఆగస్టు 22 నుంచి ప్రారంభం కానుంది.

# కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబానికే లాభం

(మొదటిపేజీ తరువాయి)

హన్మకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతిబాట బహిరంగ సభలో ఆయన కేసీఆర్ కుటుంబ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అదే సమయంలో తమ ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగుల కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

**ప్రజల కోసం మేం**

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కొడుకు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావును మంత్రులను చేసుకున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే సీతక్క, కొండా సురేఖను మంత్రులను చేశానని చెప్పారు. కేసీఆర్ ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంత్రి పదవి ఇస్తే.. తాను అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి పదవి ఇచ్చానన్నారు. కేసీఆర్ తన బిడ్డను ఎంపీగా చేసి, ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చారని.. తాను కావ్యను ఎంపీగా, యశస్వినిని ఎమ్మెల్యేగా చేశానని తెలిపారు. కేసీఆర్ సడ్డకుని కొడుకు సంతోష్‌రావును ఎంపీని చేసుకుంటే.. తాను మిత్రధర్మంగా వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ అవకాశం కల్పించానన్నారు. కేసీఆర్ వినోద్‌రావును ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమిస్తే.. తాను ఉద్యమకారుడు కోదండరాంను ఎమ్మెల్సీగా చేశానని చెప్పారు. కేటీఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసుకున్న కేసీఆర్.. తన కుటుంబానికే అధికారాన్ని పరిమితం చేశారని, తాను మహేష్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా చేశానని వివరించారు. కేసీఆర్ కుటుంబ పాలనకు, కాంగ్రెస్ ప్రజా పాలనకు ఉన్న తేడా ఇదేనని స్పష్టం చేశారు.

**వరంగల్ గడ్డది పోరాట చరిత్ర**

వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర, చైతన్యం ఉందని సీఎం అన్నారు. పాలకుల అణచివేతకు గురైన ప్రతీసందర్భంలో ఈ జిల్లా తన చైతన్యాన్ని ప్రదర్శించిందని చెప్పారు. తమకు ఎదురే లేదని భావించిన వారిని మట్టికరిపించిన చరిత్ర ఈ గడ్డదన్నారు. పాలకుర్తిలో తమ యశస్విని రాజకీయ కొండను బద్దలు కొట్టిందని పేర్కొన్నారు. పరకాలలో ప్రజా పాలన-ప్రగతిబాట కార్యక్రమానికి వేలాదిగా మహిళలు తరలిరావడం ప్రజల్లో ఉన్న చైతన్యానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాంత సమస్యల పరిష్కారం కోసం తనను, మంత్రులను పలుమార్లు కలిశారని గుర్తుచేశారు. ఆయన చొరవతోనే పరకాల ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు.

**రైతును రాజు చేయడమే లక్ష్యం**

ఇచ్చిన మాట తప్పకూడదనే సంకల్పంతో రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం కూలేశ్వరమైనా ప్రాజెక్టులను నింపి రైతులు అత్యధిక పంటలు పండించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 32 నెలల్లో ధాన్యం కొనుగోలు చేసి రూ.90 వేల కోట్లు రైతులకు చెల్లించామని తెలిపారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ ద్వారా రైతును రాజును చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం రూ.1 లక్ష కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి బోనస్ అందించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రైతు ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం అన్నదాతకు అండగా నిలిచేలా ఉందన్నారు.

**నిరుద్యోగుల భవిష్యత్ బాధ్యత మాది**

గత పాలకులు పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను బలి తీసుకున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకం పూర్తి చేశామని తెలిపారు. పోలీసు ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, నిరుద్యోగుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వయోపరిమితిలో సడలింపులు కల్పించామని చెప్పారు. ప్రతి 6 నెలలకు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత తమదని, పరీక్షలకు సిద్ధం కావాల్సిన బాధ్యత యువతదని స్పష్టం చేశారు. నిరుద్యోగులు రాజకీయ పట్టీలకు, మాయమాటలకు మోసపోవద్దని సూచించారు.

**సెప్టెంబరులో అసెంబ్లీకి రండి**

బీఆర్ఎస్ నేతలు చర్చిద్దామని సవాళ్లు విసురుతున్నారని సీఎం అన్నారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని, కేసీఆర్‌ను కూడా తీసుకురావాలని సూచించారు. గత పాలనలో జరిగిన విషయాలు, తమ ప్రభుత్వం చేసిన పనులపై అసెంబ్లీలో చర్చిద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని, ఆయన అనుభవం, సలహాలు తమకు అవసరమని అన్నారు. తనకు అనుభవం లేకపోయినా ప్రజలకు ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కష్టపడుతున్నానని చెప్పారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే రాష్ట్ర ఆదాయం సరిపోతోందని విమర్శించారు. గతంలో అధికారం అనుభవించిన వారు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కార్యకర్తల రక్తాన్ని ప్రైవేటు ఆసుపత్రులకు అమ్ముకుంటున్న రక్తపిపాసులుగా మారారని సీఎం తీవ్రంగా విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. రైతులు, ఆడబిడ్డలు, నిరుద్యోగుల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో పరకాలతోపాటు ఇక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తమది సామాన్యుల కోసం పనిచేసే ప్రభుత్వమని, ప్రజల కోసం ఎంతైనా కష్టపడతానని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరు అని ధీమా వ్యక్తం చేశారు.



**ఆడబిడ్డలకు అండగా ఉంటాం**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలకు గుండు సున్నా పెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తోందన్నారు. పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టే పనులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కేటీఆర్ కుటుంబ వ్యవహారశైలిని ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రక్తం పంచుకున్న సోదరికి సాయం చేయాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఇంటి నుంచి బయటకు గెంటేసిన చరిత్ర కేటీఆర్‌దని ఆరోపించారు. కొడుకుకు బుద్ధి చెప్పాల్సిన కన్న తండ్రి కళ్లున్న ధృతరాష్ట్రుడిలా మారిపోయారని విమర్శించారు. తాను మాత్రం ఆడబిడ్డలను గౌరవిస్తున్నానని, ఇందిరమ్మ చీరను సారెగా పెట్టి గౌరవిస్తున్నానని అన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266